
పక్షులు స్వేచ్ఛాజీవులు. ఆనందం ఎంతో అపాయం అంత వాటికి. పంజరాలలో రక్షణ ఉండి, సకల సదుపాయాలూ అమరినా స్వేచ్ఛను, మిత్తిని మాత్రమే కోరుకుంటాయి. ఎందుకో? అవి అలా ఉండిపోతే బావుండును-మన జీవితాలలో అడుగుపెట్టకుండా.

# కుక్కతోక

కలువకొలను సదానంద



నా చూపులు ఉత్తరంలోని పంక్తుల వెంబడి పరుగు తీశాయి.

"కాళహస్తి ...

"పూజ్యులైన అన్నగారికి నమస్కారాలు. నేనిక్కడకి వచ్చిన మరునాడే ఉద్యోగంలో చేరాను. ఉండడానికి గది అద్దెకు తీసుకున్నాను. భోజన సదుపాయం హోటలులో కుదుర్చుకున్నాను. మొత్తంమీద అన్ని సౌకర్యాలూ అమరినట్లే. వదినతో క్షేమంగా ఉన్నానని చెప్పండి. మీ క్షేమాలు, వదిన క్షేమాలు తెలుపవలసింది. బాబుకు, పాపకు ముద్దులు.

ఒక ముఖ్యవిషయం. ఇక్కడ సింగారం కనిపించాడు. వెంటనే గుర్తుపట్టలేకపోయాను. భోజనానికని హోటలుకు వెడితే అక్కడ క్లీనరు వేషంలో సాక్షాత్కరించాడు. ఆ చింపిరిజుట్టు, గుంటలు పడ్డ కళ్లు, ఈడ్చుకుపోయిన ముఖం, నల్లగా మాసిపోయి కంపుగొడుతూన్న మురికి బట్టలు-అబ్బ! చెడ్డ అసహ్యం వేసింది. మనిషి పొడుగ్గా పెరిగిపోయి, సన్నగా అవిసె చెట్టుకుమల్లే తయారయ్యాడు. నన్ను చూసి గుర్తుపట్టాడు కాబోలు ముఖం చాటు చేసుకున్నాడు. 'నువ్వు సింగారానివి కదూ?' అంటే తెల్లమొహం వేశాడు. తర్వాత చాటుగా పిలిపించి, నాలుగు చీవాట్లు పెట్టి, పని మాన్పించేశాను. నిన్నటినుంచీ ఎక్కడికీ వెళ్లడంలేదు. గదిలోనే ఉంటున్నాడు. ఇంతకాలమూ-ఎన్నెన్నో పడరాని పాట్లు పడ్డాడట! చివరికి విధిలేక ఇంతటి పతనానికి దిగజారిపోయాడు. మీరు తప్పకుండా వస్తారని నాకు తెలుసు. ఆలస్యమైతే జాబు వ్రాయండి.

మీ తమ్ముడు,
సూర్యం ..."

వణికిపోతున్న నా చేతి వ్రేళ్ల మధ్యనుంచి ఉత్తరాన్ని అందుకుంది కమల.

నాలోని ప్రతి రక్తాణువూ తెలియరాని వికారంతో సలసలమంటూ మరిగిపోయింది. అది కోపమో విచారమో, అవమానమో చెప్పలేను. బహుశా-ఈ లక్షణాలన్నీ ఒకదానితో ఒకటి గజిబిజిగా అల్లుకుపోయి నన్ను కుదిపివేసి ఉంటాయి కాబోలు!

సింగారం!

వెలిగారాన్ని బంగారం అన్నట్టుంది!

పేరులో ఉన్నంత శృంగారం వీడి అంతరంగంలో లేదా? వీడి జీవితరేఖ వంకరటింకరలతో వికృతాతివికృతంగా మారిపోతోందేమిటి?

మానవుడు ఒక బాటసారి! అడుగడుగునా ఆగి, తన త్రోవ స్వర్గానికే దారితీస్తుందా, లేక నరకానికి లాక్కుపోతుందా అని ఆత్మవిమర్శ చేసుకుంటాడు మనిషి. పొరపాటున తప్పటడుగు వేసినా వెనువెంటనే తన లోపాన్ని సవరించుకోజూస్తాడు. తన జీవితం సంస్కరింపబడాలి అనుకుంటాడు.

కానీ ఈ సింగారం మనఃప్రవృత్తి ఎటువంటిదో ఊహాతీతంగా ఉన్నదే! కాలి క్రింద ముళ్లకంప చిక్కుకున్నా, కాలు వెనక్కు తీసుకోడేం వీడు? 'కళ్లు మూసుకుని అలా పరుగెత్తకు. ముందర అగాధం ఉంది' అని హెచ్చరించినా వినిపించుకోడేం?

వీణ్ణి ఎలా సంస్కరించాలన్నదే ఒక జటిలసమస్య. ప్రతి ప్రయత్నమూ ఎండుటిసుకలో ఇల్లు గట్టినట్లు కుప్పగూల్చుగా విరుచుకు పడిపోతూనే ఉంది.

ఇంతకూ ఈ సింగారం ఎవరు? వీడి గురించి నాకెందుకీ అనవసరశ్రమ? నా ఆలోచనలు గతంలోనికి పరుగుదీశాయి.

000

ఆనాటి సాయంకాలం ఆఫీసునుంచి బయటకు రాగానే ఒక కొత్త ముఖం కనిపించింది. అమ్మ,

> **ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 26.7.1961 సంచికలో ప్రచురించాము.**

తమ్ముడు ఆ అబ్బాయికేసి సానుభూతితో చూస్తూ ఉన్నారు. వాడు పదేళ్ల పసిపిల్లవాడు. కాలానికి వయస్సుతో నిమిత్తం లేదేమో అది ఏర్పరచిన గాయాలు వాడిలో లీలగా అగుపిస్తున్నాయి. ఎముకల గూటిమీద చర్మాన్ని మాత్రం కప్పుకున్నట్లు దేహం, ఆ దేహం నుండి వెలువడే దుర్గంధం, చిరిగిపోయిన దుస్తులు, తైల సంస్కారానికి నోచుకోని కేశాలు, నిరాశానిస్పృహలు గూడుకట్టుకున్న ముఖం, ఆవేదన, నిస్సహాయత వెల్లివిరిసే కనుదోయి... ఎవడీ నిర్భాగ్యుడు?

అమ్మను అడిగాను. ఆమె చెప్పింది. ఆమె మాటల సారాంశం-వాడొక నిర్భాగ్యుడు. వాడికి ఉన్న ఆస్తి-వాడి తల్లిదండ్రులు. వాడు ఆ ఆస్తిని పోగొట్టుకున్నాడు. ఆదరించే దిక్కులేకపోయింది. లోకంలో ఏకాకిగా మిగిలిపోయాడు. వలసబోయే పిట్టలా చిరురెక్కల్ని అల్లల్లాడించుకుంటూ కన్నగడ్డ మీది నుండి గగనానికెగిరాడు. "అదిగో, మీ దూరపు బంధువు! అక్కడికెళ్లు!" అన్నాడెవరో శ్రేయోభిలాషి. ఆ దిక్కును బట్టుకొని వాడు గమ్యాన్ని చేరుకున్నాడు.

అమ్మ ఈ మాటలు చెబుతూంటే-ఆ పిల్లవాడు దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కివెక్కి ఏడ్చాడు. ఆ ఏడ్పుకు తట్టుకోలేక-ఎగిరెగిరి పడుతున్న వాడి చిన్నహృదయం-కన్నీళ్లతో తడిసిపోయింది. ఆ పసివాడి ఆ వేదనను చూసి నా గుండె కదిలిపోయింది. దయతో వాణ్ని ఓదార్చుతూ దగ్గరకు తీసుకున్నాను. "నీ పేరేమిటీ?" అన్నాను.

"సింగారం!" అన్నాడు.

"చదువుకున్నావా?"

తల ఊపాడు సింగారం.

"ఏం చదువుకున్నావు?"

"రెండో తరగతి!" అన్నాడు సిగ్గు పడుతూ.

వాడి వయస్సుతో పోలిస్తే-అది చాలాతక్కువ చదువు. పల్లెటూరి విద్యాభ్యాసం! వ్యక్తి, పాఠశాల, గృహం-ఈ మూడు వైపుల నుండి కూడా విద్యకు తగిన ప్రేరణ, ప్రోత్సాహం లభించిఉండవు.

"ఇక్కడ బడికి పంపుతాను. చదువుకుంటావా?"

"చదువుకుంటాను ..."

"శ్రద్ధగా చదువుకుంటే ఎంతవరకైనా చదివిస్తాను. ఏం?"

సిగ్గుచేత సింగారం ఏమీ మాట్లాడలేదు.

"వేళకు బడికెళ్లు. ఇక్కడే అన్నం తిను. సూర్యం ఉన్నాడు. వాడితో ఆడుకో. నీకేమీ భయం లేదు. ఇది మన ఇల్లు!" ఈ మాటలు వాణ్ని ఉపశమింపజేశాయి.

"ఎప్పుడూ ఏడవకూడదు. నవ్వుతూ, హాయిగా ఉండాలి. ఏడవకుండా ఉంటే నీకు కొత్త బట్టలు కుట్టిపెడతాను. సరేనా?"

"సరే!"

సింగారం క్రమంగా తన దుఃఖాన్ని, ఒంటరితనంలోని బరువును మరిచిపోయాడు. సూర్యంతో సరదాగా ఆడుకోవడం మొదలెట్టాడు. తాను ఉంటున్నది పరాయిఇల్లు అన్న భావం వాడికి ఏ కోశానా కలుగలేదు. సింగారం ఎప్పుడూ చాలా కులాసాగా ఉండేవాడు. వాడికి సినిమా పాటలు, పల్లె పాటలు, దేశభక్తి గీత్యాలు కొల్లలుగా వచ్చును. దేవుడు వాడికి కమ్మని కంఠమిచ్చాడు. పాడమన్నప్పుడంతా పాటలు పాడి వినిపించేవాడు. తన సొంతఊరిలోని వింతలు, విశేషాలు కథలల్లి సూర్యానికి చెప్పేవాడు.

వాడి వినోదమూ, విలాసమూ బడిలో చేర్పించిన నాటి వరకే! బడిలో చేరింది మొదలు-వాణ్ని నిరుత్సాహం ఆవరించింది. గంట కొట్టగానే బడికెళ్లడం, గంట కొట్టగానే ఇంటికి రావడం-దీనితో వాడి స్వేచ్ఛ హరించుకుపోయింది. బడికని చెప్పి ఇంటినుండి బయలుదేరేవాడు. వేళకు ఇంటికి వచ్చేవాడు. కానీ, పాఠాలమీద ప్రశ్నలు వేస్తే చెప్పలేకపోయేవాడు. "పంతులుగారు చెప్పలేదు మామయ్యా!" అనేవాడు. "మా మేష్టారుకే తెలీదు!! నాకేం తెలుసు?" అనేవాడు మరోసారి.

సూర్యం-ఒకరోజు నిజాన్ని బయటపెట్టేశాడు. "అన్నయ్యా! సింగారం బడికి రావడంలేదు. రోజూ-

ఊరి బయట చెరువు కట్టమీదనో, మామిడితోపులోనో గడిపి, బడి విడిచే సమయానికి ఇంటికి వస్తున్నాడు."

"నువ్వు సరిగ్గా బడికిపోవడం లేదటనే?" అంటూ చాటుగా సింగారంమీద కోప్పడ్డాను.

"ఎవరు చెప్పారు మామయ్యా నీకు? సూర్యం కదూ?" అంటూ నన్నే తిరిగి ప్రశ్నించాడు.

"వాడి మాట వినక వాడి శత్రుపక్షంలో చేరానని నా మీద కోపం. అందుకే నా మీద చాడీలు చెప్పాడు. కావలిస్తే ఎవరినైనా అడిగి తెలుసుకో! నేను బడికి వెళ్లని రోజు లేదు..."

నిజమేననిపించింది నాకు. అయినా సందేహం తీరక సుబ్బయ్య పంతుల్ని అడిగాను. "నిజమే!" అన్నాడు ఆయన... "వారంలో రెండు రోజులు బడికి వస్తే ఎక్కువ!"

నాకు చెడ్డకోపం వచ్చింది. ఇంటిదగ్గర సింగారాన్ని మందలించాను.

"చెప్పినమాట విని పడిఉంటే ఉండు. నువ్వే రాజు అనుకుంటే వెళ్లిపో! ఇక్కడ దేనికి?" సింగారం కళ్లనీళ్లు గార్చాడు. ఏమీ మాట్లాడలేదు. తన తప్పిదానికి సంజాయిషీ అయినా చెప్పుకోలేదు. అన్నానికి కూడా రాకుండా బెంగగా ఉండిపోయాడు. నా కోపమంతా జాలిగా మారిపోయింది. దగ్గరకి వెళ్లి వాడి తల నిమురుతూ-"పోనీ, ఇంకెప్పుడూ ఇలా చెయ్యకు. నేను ఏది చెప్పినా నీ మంచికే కదా!... బడికెళ్లి శ్రద్ధగా చదువుకుంటే సుఖపడతావు. రేపటినుండి సక్రమంగా బడికెళ్లుతావా?" అన్నాను.

"వెళ్తాను!" అన్నాడు సింగారం.

ఆనాటినుండీ వాడిపైన ఒక కన్ను వేసి ఉంచాను. బడికి వెడుతూ ఉన్నాడో, లేదో కనుక్కునేవాణ్ని. పాఠాలు సరిగ్గా నేర్చుకున్నాడో లేదో తెలుసుకునే వాణ్ని. నాకు తీరిక ఉన్నప్పుడంతా వాణ్ణి దగ్గర కూర్చోబెట్టుకుని, పాఠాలతోపాటు హితోపదేశం చేసేవాణ్ని!

కానీ నా ప్రయాసంతా మళ్లీ బూడిదలో పోసిన పన్నీరే అయింది. వాడి బుద్ధి వక్రమార్గాన్నే అనుసరించింది. సింగారం బడి ఎగగొట్టడం మొదలెట్టాడు. చాలాసార్లు మందలించాను. చేయి చేసుకున్నాను. ప్రయోజనం కనిపించలేదు.

ఒకనాటి సాయంకాలం బడిలోనికి వెళ్లాను. సింగారం లేదు. సూర్యం తరగతిలోకి వెళ్లాను. సూర్యం కూడా లేడు. వారం రోజులుగా ఇద్దరూ కలిసి బడి ఎగగొడుతున్నారని తెలిసింది. ఇంటికి వచ్చి పడకమీద మేను వాల్చాను.

నిద్ర లేచేసరికి వరండాలోనుండి సింగారం కూనిరాగం తీస్తూ ఉండడం వినిపించింది. పడక మీద నుంచి లేచాను. హాలులోకి వచ్చాను. దండెం మీది తుండుగుడ్డను లాగి భుజంమీద వేసుకున్నాను. దండెం మీద నుండి సూర్యం లాగు జారి కిందపడింది. ఆ లాగు జేబులోనుంచి రెండు బీడీలు నేల మీద రాలిపడ్డాయి.

సంభ్రమాశ్చర్యాలతోపాటు కోపం నన్ను ఊపివేసింది. ఆ లాగూ, బీడీలూ చేతికి తీసుకుని, గట్టిగా "అమ్మా!" అని కేకవేశాను. వరండాలో నుండి సింగారం తొంగిచూచాడు. వెలవెలబోయిన వాడి ముఖం మళ్లీ కనిపించలేదు.

"ఏమిట్రా?" అంటూ సమాధానమిచ్చింది అమ్మ -పెరట్లోంచి. "ఇలారా!" అన్నాను కోపంగా. అమ్మ వచ్చింది. "చూశావా, ఈ ప్రబుద్ధుల ప్రయోజకత్వం? వాడేడీ సూర్యం?"

"స్నానం చేస్తున్నాడు!" అంది అమ్మ-ఇంకా ఆశ్చర్యంలోంచి తేరుకోక.

నేరుగా పెరట్లోకి వెళ్లాను. "సూర్యం!" అన్నాను. ఆ కేక వాడికి పిడుగుపాటులా వినిపించింది గాబోలు-అదిరిపడి నా వైపు చూశాడు. నా చేతిలోని లాగును, బీడీలను చూశాడు. వాడి ముఖంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేకుండా పోయింది.

"ఎక్కడివి ఈ బీడీలు? చెప్పు వెధవా!" అన్నాను. వాడు ఏమీ చెప్పలేక తడబడ్డాడు.

"ఇలా రా!"

దగ్గరగా వచ్చాడు.

"నోరు తెరు!"

జంకుతూ నోరు తెరిచాడు. నోరంతా చెడ్డకంపు.

కోపంలో నాకు ఏమీ తెలియలేదు. వాడి ఆక్రోశాలు, ఆక్రందనలు నా చెవికెక్కలేదు. వాణ్ని గొడ్డును బాదినట్లుగా బాదాను. అమ్మ అడ్డురాకుండా ఉంటే పర్యవసానం ఎలా ఉండేదో చెప్పలేను.

సూర్యానికి ఏడవడానికి కూడా శక్తి లేకుండా పోయింది. వెక్కిళ్లు పెడుతూ "నాకేమీ తెలియదు. సింగారం తాగమని బలవంతం చేశాడు!" అన్నాడు.

సింగారం కనిపించలేదు. వాడు ఇంట్లోకి రానేలేదు. కంటబడగానే డొక్కచీల్చి, డోలు కట్టించాలన్నంత కోపంతో ఎదురు చూచాను. ఇంటి గుమ్మం ఎక్కగానే లోనికైనా రానివ్వకుండా అలాగే వీథిలోకి గెంటేద్దామనుకున్నాను. కానీ, అంత అవసరం లేకపోయింది. వాడు మళ్లీ గుమ్మం తొక్కనేలేదు.


రోజులు గతించిపోయాయి. ఆ సంఘటనను మరచిపోయాను. నా కోపం చల్లారిపోయింది. మళ్లీ సింగారం పైన కరుణ విజృంభించింది. నిష్కారణంగా ఇంట్లోంచి పారిపోయాడు. నేను వాణ్ని దండించనైనా లేదు. వాడి నేరాన్ని విచారించనైనా లేదు. ఈ పరిస్థితి రాగలదనే భయంతోనే వాడు కన్నులకు కనిపించకుండా మాయమైపోయాడు.

ఇంతకూ వాడి విషయంలో నేను చేసిన అపరాధమేమిటి? నాకు తోడబుట్టయినవాళ్లు ఇద్దరనుకున్నాను. దిక్కూ మొక్కూ లేనివాణ్ని చేరదీశాను. విద్యాబుద్ధులు నేర్పించి ఒక ప్రయోజకుడుగా చేయాలనుకున్నాను. ఇది నా పొరపాటు... ఈ పొరపాటు జరగకుండా ఉంటే నేను వాడి పాలిటి సింహస్వప్నం కాకపోదునేమో!

సింగారం గ్రామీణజీవితానికి అలవాటు పడినవాడు. వాడికి బడి, పాఠ్యపుస్తకాలు, ఉపాధ్యాయులు-ఎంత దూరంగా ఉంటే అంత ఉల్లాసమేమో! వాడిక్కడికి రాకముందు-సొంత ఊరిలో వాడి నిత్యజీవితం ఎలా ఉండేదో ఊహకు

## అంజలా అత్యాశ

ఇంతవరకూ రీజనబుల్‌గానే రెమ్యునరేషన్‌ను అడుగుతూ వచ్చిన అంజలా జవేరీ ఇప్పుడు యాభై లక్షలిస్తేనే గానీ షూటింగ్‌కి హాజరయ్యేది లేదని నిర్మొహమాటంగా చెప్పేస్తోంది. తన పారితోషికతో పాటుగా రానూపోనూ విమానయాన ఖర్చులు, తనకూ, తన సిబ్బందికీ స్టార్ హోటల్ ఖర్చులూ, తన షాపింగ్ ఖర్చులూ అన్నింటినీ నిర్మాత భరించి తీరాలంటోంది.



ఇదేంటయ్యా అని ఆరా తీస్తే ఈవిడగారికి తెలుగు సినిమాలు చేయాలని లేదని, అందుకే ఎక్కువ రెమ్యూనరేషన్‌ని అడిగితే తన చుట్టుపక్కలకు కూడా నిర్మాతలు రారని ఈమె ఆలోచనట. హిందీలో ఫ్లాపులతో విసిగిపోయినా, తెలుగులో పట్టం కట్టినందుకు మన నిర్మాతలదే తప్పు కాదూ. ఏరుదాటాక తెప్ప తగలెయ్యడం అంజలాకి బాగా తెలిసినట్టుంది.

వి.

అందింది. వేళకు ఉన్నం తినేవాడు. పొలాల వెంబడి తిరిగేవాడు. ఆలకాపరులతో, రైతు కుర్రాళ్లతో చెలిమి చేసేవాడు. వాళ్లతో కథలు చెప్పుకుంటూ, పాటలు పాడుకుంటూ, ఆటలాడుకునేవాడు. చిత్తంలో ఎటువంటి ఆలోచనలకూ చోటులేని బ్రతుకు అక్కడి బ్రతుకు. అక్కడున్నంతవరకు-విరగపండిన జామితోటలో చిలుక వంటివాడు సింగారం. ఇక్కడి జీవితం వాడి పాలిటికి పంజరం కాగలదని నేను ఊహించలేకపోయాను.

అమ్మ ఒక నీలాపనిందను నా మీద మోపేసింది. సింగారం పారిపోవడానికి కారకుణ్ని నేనట! వాడు మా ఇంటిలో ఉండటం నాకు ఇష్టం లేదట! అందుకే-వాడిమీద ఎప్పుడూ కారాలూ, మిరియాలూ నూరుతుంటానట! నిజమేనేమో...! వాడు పారిపోవడానికి కారకుణ్ని నేనేనేమో!

కాలప్రవాహంలో నాలుగేళ్లు దొర్లిపోయాయి. నాకు పెళ్లయింది. కమల కాపురానికి వచ్చింది. సూర్యం చదువుకున్నాడు. సింగారం ఏమైనాడో తెలియదు. ఇల్లు చాలకపోవడంతో సంసారాన్ని వేరే అద్దె ఇంట్లోకి తరలించాను.

ఒకనాటి సాయంకాలం ఆఫీసునుండి వాహ్యాళికెళ్లి ఇంటికి వచ్చాను. హఠాత్తుగా ఊహించని సంఘటనను ఎదుర్కొనవలసివచ్చింది. పూర్తిగా మారిపోయిన ఒక వ్యక్తిని ప్రత్యక్షంగా చూడటం జరిగింది...!

సింగారం ఇంట్లో కూర్చుని ఉన్నాడు. వాడికి తల అంటి నీళ్లు పోసిందేమో-అమ్మ తన చీరె కొంగుతో వాడి తల తుడుస్తూ ఉంది. సింగారం నా ముఖంలోకి చూసి, తల దించుకున్నాడు. సిగ్గుచేత-తన శరీరంలో ఏ అంగాన్ని కూడా కదల్చలేకపోతున్నాడు.

"ఎక్కణ్ణుంచి పట్టుకొచ్చావ్ ఈ మృగాన్ని?" అన్నాను అమ్మతో-పరిహాసంగా.

ఈ మాటకు సింగారం ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

"పట్టుకురాలేదు. అదే వచ్చి బోనులో చిక్కుకుంది!" అంటూ ఆ చిక్కుకున్న విధానాన్ని వివరించి, కొంత వినోదాన్ని కలగజేసింది అమ్మ.

ఆ మధ్యాహ్నం పూట ఒక భిక్షగాడు వచ్చి ఇంటిముందు నిలబడ్డాడు. "అమ్మా! ఆకలి! కవళమన్నం పెట్టండి!" అన్నాడు. కమల ఆ భిక్షగాణ్ని పరిశీలనగా చూసింది. వాడి వయస్సు పదిహేను సంవత్సరాలకు మించి ఉండదు. వాడు కుంటీ కాదు, కురూపీ కాదు. దారిద్ర్యమూ, అపరిశుభ్రతా మినహాయిస్తే అబ్బాయి ముచ్చటగా ఉన్నాడు. వాడి బట్టలు నల్లగా మాసిపోయి ఉన్నాయి. చంకన జోలె అన్నంతో నిండి బరువుగా వ్రేలాడుతోంది.

"ఏ ఊరబ్బాయ్ మీది?" అంది కమల.

"మాది మంగళంపేట."

"నీకు అమ్మా, నాన్నా ఎవరూ లేరా?"

"ఎవ్వరూ లేరు."

"నువ్వేం ముసలాడివా, ముతకాడివా? ఏదైనా పని చేసుకోరాదా? అడుక్కుతినటం తప్పు కదూ?"


"ఏమో...? నేనేం పని చేయగలను? నాకు చదువు రాదు. నన్నెవరూ చదివించలేదు."

ఇంతలో అమ్మ పళ్లెంలో అన్నం పెట్టింది. ఆ భిక్షగాడు జోలె పట్టాడు. అమ్మ అన్నం వేయబోతూ వాడి ముఖంలోకి చూసింది. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. వెంటనే వాడి ముఖం వెలవెలపోయింది. చూపులు మరల్చుకున్నాడు.

## నీ ఫాన్‌ని రా...

ప్రతీ కళాకారుడికీ కొన్ని ప్రశంసలు లభిస్తుంటాయి. అలాంటి ప్రశంసలెన్నింటినో ప్రకాశ్‌రాజ్ తన నటనతో పొందగలిగాడు. అయితే తాను జీవితంలో మరిచిపోలేని అభినందన ఒకటుందని చెప్పాడు.

'ఓ రోజు నేను షూటింగ్ పూర్తి చేసుకుని వచ్చే సరికి ఇంట్లో ఫోన్ మోగుతోంది. రిసీవర్ ఎత్తగానే 'ప్రకాశ్‌రాజ్ ఉన్నారా?' అని అవతలి వ్యక్తి అడిగారు. నేనే ప్రకాశ్‌రాజ్‌నన్నాను. 'నేను నీ ఫాన్‌ని రా' అందా గొంతు. నా అభిమానంటున్నాడు, ఇలా మాట్లాడుతున్నాడేంటని కన్ఫ్యూజ్ అయ్యాను. ఆ తరువాత తనే 'నేనయ్యా, నసీరుద్దీన్‌షాని మాట్లాడుతున్నాను. అంతఃపురంలో నువ్వు చేసిన పాత్రని హిందీలో నన్ను చేయమంటున్నారు. నీ అంత బాగా నేను చేయగలనా అని ఆలోచిస్తూ నీకు ఫోన్ చేశాను' అన్నారాయన. జాతీయ అవార్డు కంటే ఆయన ఇచ్చిన కాంప్లిమెంట్ ఎక్కువనిపించింది అని ప్రకాశ్‌రాజ్ అన్నారు. ఎందుకంటే ప్రకాశ్ రాజ్ మొదటి నుంచీ నసీరుద్దీన్ షా వీరాభిమానట.



వి.

అన్నమైనా పుచ్చుకోకుండా నిలువెల్లా తడబడుతూ వీధిలోకి జారుకున్నాడు. అమ్మ సంభ్రమం నుంచి తేరుకుని "ఒసేయ్ వాణ్ని పట్టుకో!" అంది కమలతో. వాడు అప్పటికే వీధి మలుపు తిరిగాడు. అమ్మ వెంటనే కొంగు నడుముకు బిగించి, ఆ మృగాన్ని వెన్నాడింది. వీధివీధీ గాలించింది. చివరికి కృతకృత్యురాలైంది.

అమ్మ వాణ్ని స్నానం చేయించి, సూర్యం బట్టలు తొడిగించింది... ఆ రాత్రి అందరం భోంచేశాము. భోజనాలప్పుడు-ఎత్తిపొడుపుగా-"ఏమిటోయ్, చదువుకుంటావా?" అన్నాను సింగారంతో. వాడు కిక్కురుమనకుండా కన్నీరు మాత్రం కార్చాడు. తరువాత వాణ్ని ఏమీ అనలేదు.

ఈ నాలుగేళ్లూ వాడు ఎన్నో ప్రదేశాలు తిరిగాట్ట. ఎన్నో పుణ్యక్షేత్రాలు చూశాట్ట. ఒక సంవత్సరంపాటు అనాథశరణాలయంలో ఉండి, పారిపోయి వచ్చాట్ట!

నాలుగు రోజులపాటు ప్రయత్నించి, వాడికొక ఉద్యోగం చూశాను. నెలకు ముప్పై రూపాయలు జీతం.

నా ప్రయత్నం సఫలమైన తరువాత "ఏమోయ్! ఏదైనా పని చేసుకుని బతుకుతావా, లేదూ-ఇలాగే భిక్షమెత్తుకుంటావా?" అని అడిగాను సింగారాన్ని.

సింగారం బదులు పలకలేదు.

ఈసారి పరుషోక్తి చాలించి, సరళంగానే అడిగాను..."ఉద్యోగంలో చేర్పుతాను, చేస్తావా?"

"చేస్తాను..."

సింగారం ఉద్యోగంలో చేరాడు. పదిరోజుల తరువాత-అతడు సరిగ్గా పనిలోకి వెళ్లడం లేదని తెలిసింది. ఉద్యోగాన్ని అండగా పెట్టుకుని, అప్పులు చేసి ఖర్చులు పెడుతున్నాట్ట!

"ఉద్యోగం నిలుపుకోవాలని ఆశ ఉందా? లేదా!" అన్నాను ఒకరోజు. "బానిస చాకిరీ మించి మరేం చెయ్యగలను మామయ్యా?" అన్నాడు సింగారం.

వాడి ఉద్యోగదశలో ఒక నెలరోజులు గతించిపోయాయి. ఆనాడు జీతాలరోజు. సింగారం జీతం డబ్బుల్ని ఎత్తుకుపోయాడో, జీతం వాణ్ని ఎత్తుకుపోయిందో తెలియదుగానీ మొత్తంమీద సింగారం మాత్రం కనిపించలేదు.

వాడికి ఉద్యోగం నచ్చలేదు. భిక్షాటనమే నచ్చిందేమో! స్వాతంత్ర్యం అనేది మానవుడి జన్మహక్కు. సింగారానికి స్వేచ్ఛ కావాలి. కానీ, ఆ స్వేచ్ఛ అత్యధికంగా అంటే సంపూర్ణతకన్నా అధికంగా ఉండాలి. వాడు భిక్షమెత్తుకుంటున్నా అడగకూడదు. తన కన్ను తాను పొడుచుకుంటున్నా వారించరాదు. లేకుంటే-వాడి స్వేచ్ఛ దెబ్బతింటుంది.

ఆనాటి నుండి ఈ ఐదుసంవత్సరాల కాలంలో-

మళ్లీ నా మూలంగా అతని స్వేచ్ఛకు ఆటంకం కలగలేదు.

అమ్మ స్వర్గస్థురాలైంది. ఆమె కన్ను మూయబోతూ కొన్ని మాటలు అంది. ఆ మాటలు నాకు శిరోధార్యాలు! "సింగారం మళ్లీ కనిపిస్తాడనే ఆశ నాకుంది. వాడి తప్పులన్నీ మన్నించేయి. పసితనం! అన్నీ తెలియక చేసిన తప్పులు! లేకుంటే తనంతట తానుగా చెడిపోవడానికి వాడేం వెర్రివాడా? పెద్దవాడైతే-వాడి బుద్ధి వికసించకపోదు. వాడి బ్రతుకుని బాగుపరిచే బాధ్యత నీది! అయినవాడిని తొలగదోశాడన్న నిందను మాత్రం నెత్తిన వేసుకోకు!"

తల్లి హితవు నా గుండెల్లో నాటుకుపోయింది. సింగారాన్ని సంస్కరించాలన్న పట్టుదల నాలో గాఢతరమైపోయింది. కానీ సింగారం కనిపించడు. వాడి పేరైనా వినిపించదు.

సూర్యం నాకు గర్వకారకుడయ్యాడు. వాడొక ప్రయోజకుడు కాగలిగాడు. వాడికి కాళహస్తిలో ఉద్యోగమైంది. ఆ ఉద్యోగం మరొకచోట అయితే సింగారం జాడ నాకు తెలిసేది కాదు.

000

సింగారం మీద కోపం పుట్టింది. మరునిముషం వాడి స్థితికి జాలి కలిగింది. అమ్మ జ్ఞాపకం వచ్చింది. కాళహస్తి వెళ్లడానికే నిశ్చయించాను. ఆఫీసుకు రెండు రోజులు సెలవు పెట్టి, కనులతో చెప్పి బస్సెక్కాను.

అమ్మ మాటలు చెవుల్లో గింగురుమన్నట్లయింది. సింగారం దిక్కులేనివాడు. భగవంతుడు వాడికి నన్ను చూపించాడు. కానీ వాడు తన అదృష్టాన్ని, భవిష్యత్తును తానే చంపుకున్నాడు. మళ్లీ-దిక్కులేనివాడికి మల్లేనే దూరంగా వెళ్లిపోయాడు. పోనీ-అది బాల్యసహజమైన అజ్ఞానమే అనుకుందాం. ఇప్పుడు సింగారానికి బాల్యం అంతరించింది. ఇరవై ఏండ్లు దాటిన యువకుడు వాడు. అక్షరజ్ఞానం స్వల్పమైనా వాడికి లౌకికజ్ఞానానికి మాత్రం లోటుండదు. మంచి చెడ్డల విచక్షణాజ్ఞానానికి కొదువ ఉండదు. తన బతుకు తాను చక్కదిద్దుకోగల వయస్సు వాడిది. మునుపటి పెడబుద్ధులన్నీ నశించి ఉంటాయి. వాడి హృదయం పశ్చాత్తాపంతో రగిలిపోతూ ఉంటుంది. ఇన్నాళ్లూ వాణ్ని మనిషిగా రూపొందించడం నా చేతగాకపోయింది. ఇప్పుడది సులభసాధ్యం. వాణ్ని ఇంటికి తీసుకురావాలి. ఉద్యోగానికి వాడు అనర్హుడు. విద్య లేనివాడు. కానీ వాడికి బ్రతుకు తెరువు చూపించాలి. వ్యాపారంలో దించాలి. దేవుడు అనుకూలిస్తే వాణ్ని ఒక ఇంటివాణ్నిగా చేయాలి... ఈ నా సంకల్పాలను సింగారం ఈసారి అడుగంట త్రుంచి వేశాడంటే-జీవితంలో వాణ్ని ఒక వ్యక్తిగా తీర్చిదిద్దగలనన్న విశ్వాసాన్ని, ఆశను పూర్తిగా వదులుకోవచ్చు.

బస్సు దూరాన్ని మింగివేస్తూ గమ్యంవైపు దూసుకుపోతూంది. ఈ ప్రయాణంవల్ల నాకు చాలా లాభాలున్నాయి. శ్రీకాళహస్తీశ్వరుణ్ని దర్శించుకోవడం, గాజు, పింగాణీ, కంచు ఫాక్టరీలను చూడడం, అన్నిటికన్నా ముఖ్యం సింగారాన్ని ఇంటికి పట్టుకురావడం.

కాళహస్తీపుణ్యక్షేత్రం కన్నులపండువుగా కనిపిస్తోంది. బస్సు స్వర్ణముఖి వంతెనను దాటుకొని, నగర మధ్యభాగంలో ఆగింది. బస్సు దిగాను. దేవాలయ గోపురాగ్రాలను చూడగానే-నాలోని సంకల్పం మరొకమెట్టు పైకి వెళ్లింది.

గంట అయిదున్నర కావస్తూంది. వీథులన్నీ కోలాహలంగా ఉన్నాయి. సూర్యుడు పడమటి కొండ మీద కాలూనబోతున్నాడు. పక్షులు గూళ్లకు ఎగిరిపోతున్నాయి. శ్రమవల్ల అలిసిపోయిన అనేక హృదయాలు-స్వర్ణముఖి నదీతీరాన విశ్రమించడానికి గాబోలు-సాగిపోతున్నాయి.

సూర్యం చిరునామా ఆధారంగా-వాడి గదిని వెతికి పట్టుకోవడంలో ఆయాసం ఏమీ కనిపించలేదు. గది తలుపులు తెరిచి ఉన్నాయి. నా కాళ్లకన్నా ముందుగా నా చూపులు గది లోపలికి పరుగు తీశాయి.

సూర్యం చిరాకుగా పెట్టెనంతా వెతుక్కుంటున్నట్టున్నాడు. బట్టలన్నీ సవరించుకుంటున్నాడు. గదిలో సింగారం లేడు. సూర్యం నన్ను చూడగానే నవ్వలేక ఒక చిరునవ్వు నవ్వాడు.

"వాడేడీ? సింగారం?" అన్నాను ఉత్కంఠను అణచుకోలేక.

సూర్యం భావగర్భితంగా నాకేసి చూస్తూ అన్నాడు. "ఏమో, నాకూ తెలీదు. ఆఫీసునుంచి నీకన్నా పదినిమిషాల క్రితం మాత్రమే నేను గదిలోకి వచ్చాను. కానీ, సింగారం లేదు, పెట్టెలో డబ్బు లేదు. నా బట్టల్లో సగానికి సగం కనిపించడంలేదు. నా బూట్ల జత ఎక్కడికి నడిచిపోయిందో తెలియదు. కాబట్టి సింగారం ఇక కనిపించడు!"

...నేను ఆశ్చర్యపడినమాట నిజమేకానీ, సింగారం ఒక సమస్య అనుకోవడం మాని, అతన్ని సంస్కరించడం సాధ్యమా అనేదే ఒక సమస్య అనుకుంటే-నా సమస్య ఆ క్షణంలో తేలికగా పరిష్కృతమైపోయింది. సింగారం పతనానికి కారణం-వాడి వయస్సు కాదు, వాడి బుద్ధి! అది పెరగలేదు. వాడి బుద్ధిని ఆ విధి మార్చాల్సిందే! ఇక నా చేతనైనదల్లా ఆ భారాన్ని విధిమీద మోపి, నేను ఊరుకోవడమే!

...కుక్క తోక వంకర! ఆ వంకరను పోగొట్టడం అసాధ్యం అని తెనుగు నానుడి. కానీ-ఆ కార్యం సాధ్యమే! సింగారాన్ని బాగువరచగలిగితే-కుక్క తోకను చక్కజేసినట్లే!

■

